సాక్షి జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 21 । మార్చి । 2023



ప్రభుత్వ ఖజానాకు టోకరా..

నకిలీ వే బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండికొట్టిన ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు సీపీ రంగనాథ్ తెలిపారు.

- 8లో▸



నడుస్తున్న ఆటోపై విరిగిపడిన చెట్టు

కూలీలు, విద్యార్థులతో వెళ్తున్న ఆటోపై రోడ్డు పక్కనే ఉన్న చెట్టు విరిగిపడి ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో చోటు చేసుకుంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0^0 /22.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. రాత్రి పూట చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

న్యూట్రీషన్ కిట్ల పంపిణీ

భూపాలపల్లి అర్బన్: ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం విద్యార్థినులకు న్యూట్రీషన్ కిట్లు అందజేసినట్లు ఆయుష్ ఇన్‌చార్జ్ డాక్టర్ తనూజరాణి తెలిపారు. కిట్‌లో రాగి లడ్డూలు పంపిణీ చేసినట్లు తెలిపారు. దీంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరిగి, మానసిక ఆందోళనలను దూరం చేస్తుందన్నారు.

పట్టువస్త్రాల బహూకరణ



గణపురం: కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవానీ సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లకు గణపురం మండలకేంద్రానికి చెందిన పింగిలి అనసూర్య రమేష్ చందర్‌రెడ్డి, దీప్తి సాధన్‌రెడ్డి దంపతులు రూ.21వేలతో సంవత్సరానికి సరిపడా పట్టువస్త్రాలు సోమవారం ఆలయానికి అందజేశారు. నాలుగు సంవత్సరాలుగా అనసూర్య రమేష్ చందర్ రెడ్డి, దీప్తి సాధన్ రెడ్డి దంపతులు ఆలయానికి పట్టువస్త్రాలను బహూకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముసునూరు నరేష్ వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందజేశారు. దంపతులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు ఏరియా ఆస్పత్రిలో సమస్యలపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ పద్మజకు వినతిపత్రం అందజేశారు. పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆగయ్య, సంపత్ , సమ్మిరెడ్డి, రఘోత్తమ్ రెడ్డి, జగత్‌రావు, మధు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద తనిఖీలు



మహదేవపూర్: మండలంలోని మేడిగడ్డ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. మావోయిస్టులు సంచరిస్తున్నారేమోనని అనుమానంతో మేడిగడ్డ బ్యారేజీ (సరిహద్దు) వద్ద విస్తృత తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు. వాహనాల పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పత్రాలు సరిగా లేని వారికి జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు ధనుంజయ్, అనంత్, సిబ్బంది పాల్గొన్నారు.

3,531 ఎకరాల్లో పంట నష్టం



భూపాలపల్లి రూరల్: నాలుగు రోజులుగా కురుస్తున్న వడగళ్ల వానకు జిల్లావ్యాప్తంగా దాదాపు 3,531ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్, ఉద్యానశాఖ అధికారి సంజీవరావు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మొక్కజొన్న 2,684 ఎకరాలు, వరి 205, మిర్చి 452, మామిడి 57, పుచ్చకాయ 105, బొప్పాయి 20, అరటి 8 ఎకరాలకు నష్టం జరిగినట్లు తెలిపారు. మిర్చి, మొక్కజొన్న, పంటలు ఎక్కువగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. ప్రాథమిక నివేదిక కలెక్టర్‌కు పంపించినట్లు తెలిపారు.

24న జాబ్ మేళా

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 24న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి శ్యామల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండోసెంట్ బ్యాంకులో 150 లోన్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇంటర్, డిగ్రీ పాసైన వారు అర్హులని తెలిపారు. హైదరాబాద్, జనగామ, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యాపేట కేంద్రాల్లో పనిచేయాల్సి ఉంటుందని వేతనం రూ.12వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 82476 56356, 77024 57968 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

రెన్యూవల్‌కు స్వస్తి

శాశ్వత ప్రాతిపదికన ఎంప్లాయిమెంట్ కార్డు

- కొత్త మార్గదర్శకాలు జారీ



భూపాలపల్లి అర్బన్: ఇప్పటివరకు ఎంప్లాయిమెంట్ కార్డు కావాలంటే కార్యాలయానికి చెప్పులు అరిగేలా తిరగాల్సిందే. ప్రతి సంవత్సరం కార్యాలయానికి వెళ్లి రెన్యూవల్ చేసుకోవాల్సిందే. ప్రస్తుతం ఈ విధానాన్ని తొలగించి ఉపాధి కల్పనశాఖ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది .ఒకసారి ఎంపాయిమెంట్ కార్డు పొందినవారు తిరిగి రెన్యూవల్ చేసుకోవాల్సిన అవసరం లేదు. శాశ్వత ప్రతిపాదికన కార్డులు జారీచేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 3,254మంది పురుషులు, 1,260మంది మహిళలు మొత్తంగా 4,514మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకొని కార్డులు పొందారు. రెన్యూవల్ చేసుకోలేని వారు తమ సీనియార్టీని కోల్పోతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం నూతన విధానం ప్రవేశపెట్టింది.

54ఏళ్ల వరకు వర్తింపు

ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో పేర్లు నమోదై ఉన్న నిరుద్యోగులు తమ కార్డులను ఇకపై రెన్యూవల్ చేసుకునే పనిలేదు. అభ్యర్థికి 54ఏళ్ల వయస్సు వచ్చే వరకు ఇది వర్తిస్తుంది. ఉన్నత చదువులు, సర్టిఫికెట్లు, ఇంటినంబర్లు, ఈ–మెయిల్, ఫోన్‌నంబర్ వంటివి వెబ్‌సైట్లో నమోదు చేసుకునేలా వెసులుబాటు కల్పించారు. నూతనంగా రిజిస్ట్రేషన్ చేసుకునేవారు ఆన్‌లైన్ www.employment.telangana.gov.in వివరాలు నమోదు చేసుకోవాలి. యూసర్ ఐడీ, పాస్‌వర్డ్ వస్తుంది. అభ్యర్థి వివరాలను ఉపాధి కల్పన కార్యాలయంలో పరిశీలించి కార్డును అందజేయనున్నారు. అభ్యర్థి జిల్లా కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. యూసర్ ఐడీ, పాస్‌వర్డు ద్వారా కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇక నిరుద్యోగ అభ్యర్థుల జాబితాను జాతీయస్థాయి వెబ్‌సైట్‌కు బదిలీ చేయడం మూలంగా ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని భావిస్తున్నారు.



ప్రతి ఒక్కరికీ కార్డు తప్పనిసరి..

విద్యార్హత ఆధారంగా ప్రతీ ఉద్యోగి ఎంప్లాయిమెంట్ కార్డులను తీసుకోవాలి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇక నుంచి శాశ్వత ప్రాతిపదికన కార్డును అందజేశారు. కొత్త కార్డు కోసం వైబ్‌సైట్‌లో తమ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇప్పటికే కార్డు ఉన్న వారికి శాశ్వత పద్ధతిలో అప్‌డేట్ చేస్తున్నాం. ప్రభుత్వం ఇటీవల ఉద్యోగాలు భర్తీచేస్తున్న క్రమంలో అభ్యర్థులు కచ్చితంగా ఎంప్లాయిమెంట్ కార్డులు తీసుకోవాలి. కార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా ప్రక్రియను పూర్తిచేసి కార్డును జారీ చేస్తాం.

- శ్యామల, జిల్లా ఉపాధి కల్పన అధికారి

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

కలెక్టర్ భవేష్‌మిశ్రా



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి రూరల్: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం ఇల్లందు క్లబ్‌హౌస్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 22దరఖాస్తులు కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలు విన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించే విధంగా కృషి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఆశాలత, సీపీఓ కె.శామ్యూల్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసరావు, పక్కన ఇతర సభ్యులు

పాలకమండలి పరిచయ ఆత్మీయ సమ్మేళనం

కాళేశ్వరం: కాళేశ్వరం దేవస్థానంలో అర్చకులు, సిబ్బంది భక్తులకు అందుబాటులో ఉండాలని దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నూతన పాలకమండలి సభ్యులు ఈఓ మహేష్, అర్చకులు, సిబ్బందితో కలిసి మొదటిసారి పరిచయ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. భక్తులతో ప్రతి ఒక్కరూ మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. అర్చక, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి పాలకమండలి ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ మంజూరుచేసిన రూ.25కోట్ల నిధులతో చేపట్టిన నిర్మాణాలు, చేపట్టాల్సిన నిర్మాణాలపై ఆరా తీశారు. త్వరలో నిర్మాణాలన్నీ పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు కామిడి రాంరెడ్డి, కలికోట దేవేందర్, అడప సమ్మయ్య, కుంభం పద్మ, సిద్ధాంతి భానుప్రకాశ్, మెండ వెంకటస్వామి, బండి రాజయ్య, ఆరెల్లి సత్యనారాయణగౌడ్, అనంతుల రమేష్‌బాబు, శ్యాంసుందర్ దేవుడ పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు



తిలకం దిద్దుతున్న యువతి

టేకుమట్ల(రేగొండ): కేంద్రంలో, రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం రేగొండ మండలంలోని లింగాల, కోటంచ, జోగయ్యపల్లి, పోచంపల్లి, మడ్తపల్లి, పొనగల్లు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు తీసుకుని బాగుపడింది కేవలం కేసీఆర్ కుటుంబమేనని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పన్నుల భారం మోపుతూ సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి నియంత పాలన కొనసాగిస్తుందని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి కమీషన్లపై ఉన్న ప్రేమ రాష్ట్ర ప్రజలపై లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల నెత్తిన అప్పులు వేస్తూ సామాన్యులు, రైతులు, నిరుద్యోగులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గూటోజు కిష్టయ్య, కనకం రమేష్, పత్తి తిరుపతి, బానోతు రవీందర్, సూరం వీరేందర్, మేకల భిక్షపతి, తిరుపతి, శంకరయ్య, కిరణ్, వీరబ్రహ్మం, భిక్షపతి, రవి, దేవేందర్, సదయ్య పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు కార్యాచరణ

కలెక్టర్ భవేష్‌మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: 2025 నాటికి టీబీ రహిత దేశంగా తయారు చేయడమే లక్ష్యంగా పక్కా కార్యాచరణ రూపొందించి అమలుచేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా సూచించారు. టీబీ వ్యాధి నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సోమవారం తన కార్యాలయంలో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. 2008లో పోలియో రహిత దేశంగా రూపొందించుకున్నామని, టీబీ నిర్మూలనకు కృషిచేయాలని సూచించారు. టీబీని ముందస్తుగా గుర్తిస్తే చికిత్స అందించి నయం చేయవచ్చని, టీబీని విస్మరిస్తే మరొకరికి సోకే ప్రమాదం ఉండదన్నారు. లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. సర్పంచ్, వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు, రేషన్‌డీలర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, ఇతర ముఖ్యనాయకులు ప్రజాప్రతినిధులు, అన్నివర్గాల వారిని భాగస్వామ్యం చేస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సిబ్బంది పాల్గొని జిల్లాలోని 241 గ్రామ పంచాయతీలు, 30 మున్సిపల్ వార్డులలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు, పాఠశాలలో చదివే విద్యార్థులకు టీబీ వ్యాధి లక్షణాల పట్ల అవగాహన కల్పించి వ్యాధి లక్షణాలు ఉన్న వారి వివరాలు సేకరించాలన్నారు. గ్రామంలో మున్సిపల్ వార్డులలో సమావేశాలు నిర్వహిస్తూ టీబీ పట్ల ఉన్న సామాజిక రుగ్మత నిర్మూలించేలా కృషి చేయాలని చెప్పారు. రెండు, మూడు సంవత్సరాల రికార్డులను పరిశీలించి టీబీ కేసులు నమోదైన గ్రామాల పట్ల అధిక శ్రద్ధ వహించాలని, టీబీ వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి, ఆన్‌లైన్‌లో నమోదుచేసి, చికిత్స అందించాలని, ప్రతి మాసం వారికి రూ.500 ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డీఆర్‌డీఓ పురుషోత్తం, జెడ్పీ సీఈఓ రఘువరన్, సీపీఓ శామ్యూల్, డీఈఓ రాంకుమార్, డీపీఆర్‌ఓ శ్రీధర్, డీపీఓ ఆశాలత, అధికారులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

నిరసన దీక్షలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి



నిరసన దీక్షలో మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: పేపర్ లీకేజీ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీని నిరసిస్తూ సోమవారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. నష్టపోయిన ఒక్కో విద్యార్థికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక పోలీసులతో ఉద్యమాలను అణచివేయటం తప్ప కేసీఆర్ సాధించింది ఏమీ లేదన్నారు. నిరుద్యోగ యువతకు కోచింగ్ ఇప్పించాం అని గొప్పలు చెప్పుకునే ఎమ్మెల్యే నిరుద్యోగుల పక్షాన ముఖ్యమంత్రిని నిలదీయాలని చెప్పారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని 44మంది నిరుద్యోగుల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు ముడుపులు తీసుకుంది నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ నిరసన దీక్షలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల గణపతి, నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు సుంకరి మనోహర్, దొంగల రాజేందర్, ముడుపు అశోక్, రామకృష్ణ, సత్యవతి, రాజునాయక్, అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న సామ్రాజ్యవాద వ్యతిరేక దినం

- సీపీఐ (మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ కార్యదర్శి వెంకటేశ్

పలిమెల: భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులను బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఉరి తీసిన మార్చి 23 రోజును సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటించాలని సీపీఐ (మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ కార్యదర్శి వెంకటేశ్ కోరారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు కార్మికులు, కర్షకులు హక్కులు కాలరాస్తూ, రైతులకు గిట్టుబాట ధర ఇవ్వకుండా, పేదలను మరింత పేదలుగా, ధనికులను మరింత ధనికులుగా చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 23న సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటించాలని కోరారు. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, ఆదివాసీలు, విప్లవ ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాలు, మేధావులు, విద్యార్థులు, మహిళలు, పీడిత కులాలు, మైనార్టీ వర్గాలు పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు.

శ్రీరాముని తలంబ్రాలు బుక్‌చేసిన చైర్మన్



తలంబ్రాలు బుక్ చేస్తున్న చైర్మన్

మహదేవపూర్: ఈనెల 30న జరిగే సీతారామ కల్యాణ మహోత్సవంలో భాగంగా భద్రాచలం నుంచి ముత్యాల తలంబ్రాలను నేరుగా కస్టమర్లకు అందించే విధంగా టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ (కార్గో) ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. కాళేశ్వర దేవస్థానం చెర్మన్ లింగంపల్లి శ్రీనివాస్‌రావు భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ తలంబ్రాలు బుక్‌చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం చెర్మన్ మాట్లాడుతూ.. భద్రాచలం సీతారాముల కల్యాణ మహోత్సవ తలంబ్రాలు తమ డైరెక్టర్‌లకు కూడా బుక్ చేసినట్లు తెలిపారు. కేవలం రూ.116తో బుకింగ్ చేసుకుంటే నేరుగా ఇంటికి చేరవేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణి బాయి రామారావు, ఆర్టీసీ సిబ్బంది వేల్పుల చంద్రమౌళి పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న విజయభాస్కర్




పంటలను పరిశీలిస్తున్న సత్యనారాయణరావు

చిట్యాల: అకాల వర్షంతో దెబ్బతిన్న మిర్చి, బొప్పాయి, మొక్కజొన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, జెడ్పీటీసీ గొర్రె సాగర్ సోమవారం పరిశీలించారు. మండలంలోని చల్లగరిగ, ముచినిపర్తి, కైలాపూర్, సీఆర్‌పల్లి గ్రామాలలో పంటలను పరిశీలించారు. దెబ్బతిన్న పంటలపై ప్రాథమిక అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక పంపించి రైతులను ఆదుకుంటామని చెప్పారు.

రైతులను ఆదుకోవాలి..


మండలంలో వడగళ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలతో రైతులు విలవిలలాడుతున్నారని వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.40వేల నష్టపరిహారం అందించాలని కోరారు.

యూనిట్లను గ్రౌండింగ్ చేయాలి



మాట్లాడుతున్న పీఓ అంకిత్

బ్యాంకర్లతో పీఓ అంకిత్ సమావేశం



కొబ్బరికాయ కొడుతున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న ఎంఎస్‌ఎంఈ, ఈఎస్ఎస్ యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని పీఓ ఛాంబర్‌లో బ్యాంకర్లు, అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. జిల్లాలోని గిరిజనులకు ఆర్థిక సాయం పథకాలను ఈఎస్ఎస్, ఎంఎస్ఎం ఈ పథకాల పెండింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకుల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. యూనిట్లలో ఏదైనా లోపాలు ఉంటే వెంటనే సరి చేసుకొని యూనిట్లను లబ్ధిదారులకు అందించాలన్నారు. ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో గ్రౌండింగ్ చేసిన యూనిట్ల ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. యూటిలైజేషన్ సర్టిఫికెట్లను సమర్పించాలన్నారు. ఈఎస్ఎస్, ఎంఎస్ఎంఈ యూనిట్ల మంజూరు, గ్రౌండింగ్ ప్రక్రియకు అర్హులైన ఎస్టీ అభ్యర్థులకు బ్యాంక్ సమ్మతి జారీ చేయాలని బ్యాంకర్లను పీఓ కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఎస్ఓ రాజ్‌కుమార్, ఈఈ హేమలత, చీఫ్ మేనేజర్ రమేష్‌కుమార్, కంట్రోలర్లు జాగోర్, థామస్ తిరు, శివకుమార్, శ్రీనివాస్‌రావు, భిక్షపతి పాల్గొన్నారు.

గురుకుల బాలికల డిగ్రీ కళాశాల ఏర్పాటు

ములుగు నియోజక వర్గంలో మంజూరైన గురుకులం బాలికల డిగ్రీ కళాశాలను ఏటూరునాగారం పీఎంఆర్‌సీలో ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. మండల కేంద్రంలోని పీఎంఆర్‌సీ భవనంలో సోమవారం బాలికల కళాశాలను పీఓ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ప్రస్తుతం వరంగల్ నియోజకవర్గమైన ఒల్లాపూర్‌లో కళాశాల నడిచేదన్నారు. ఇప్పుడు దానిని ఏటూరునాగారం తరలించామన్నారు. ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, ఫ్యాకల్టీ సభ్యులతో కలిసి కళాశాలను ప్రారంభించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్‌లు శైలజ, ప్రీతి, మౌనిక, ఇతర ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


ముళ్లపొదల్లో కృష్ణ మృతదేహం

కాజీపేట అర్బన్: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన కాజీపేట మండలం అమ్మవారిపేటలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేటలోని రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బొజ్యన కృష్ణ (36) మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం బీబీనగర్ తండాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తన భార్య రాధిక స్వగ్రామం మడికొండకు ఇటీవల తమ సమీప బంధువులు మృతి చెందగా వచ్చాడు. ఆదివారం రంగశాయిపేటలోని బంధువులను కలిసేందుకు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి మడికొండకు వస్తున్న క్రమంలో అమ్మవారిపేటకు రాగానే బైక్ అదుపుతప్పి ముళ్లపొదల్లో పడిపోయాడు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేయడంతో ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిని తండ్రి వేధిస్తున్నాడని కుమారుడి ఆత్మహత్య


బర్ల శ్రీకాంత్(ఫైల్)

గీసుకొండ: తండ్రి తరచుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి తన తల్లితో గొడవపడుతూ వేధిస్తుండటంతో మనస్తాపం చెందిన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన బర్ల శ్రీనివాస్, స్వరూప దంపతులకు కూతురు, కుమారుడు ఉండగా కూతురు వివాహం జరిగింది. కుమారుడు బర్ల శ్రీకాంత్(27) డిగ్రీ వరకు చదువుకుని ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. తండ్రి కూలీ పనికి వెళ్లి తరచుగా తాగి వచ్చి తన తల్లి స్వరూపను తిడుతూ.. కొడుతూ ఉండేవాడు. ఆదివారం రాత్రి కూడా తండ్రి తాగివచ్చి తన తల్లితో గొడవ పడటంతో శ్రీకాంత్ ఆమెను ధర్మారంలోని బంధువుల ఇంటికి పంపించాడు. తిరిగి తన ఇంటికి వెళ్లి గది తలుపులు మూసి ఇంటిలోని దూలానికి ఉరి వేసుకున్నాడు. సోమవారం ఉదయం అతడి తల్లి వచ్చి కిటికీలో నుంచి చూడగా అప్పటికే దూలానికి వేలాడుతూ మృతి చెంది ఉన్నాడని మృతుడి బంధువులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

ప్రభుత్వ ఖజానాకు టోకరా..

- నకిలీ వే బిల్లులతో ఇసుక రవాణా
- పోలీసులకు చిక్కిన ముఠా
- ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం
- విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్


మాట్లాడుతున్న సీపీ రంగనాథ్, పక్కన అధికారులు

వరంగల్ క్రైం : నకిలీ వే బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండికొట్టిన ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ తెలిపారు. సోమవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రంగనాథ్ మాట్లాడారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా, బిల్లులు ఎలాంటి తేడాలు కనిపించకుండా నకిలీలు సృష్టించి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న 10 మంది ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ఏదుల కిరణ్, ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్, హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన గంట ప్రదీప్‌రెడ్డి, భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మంచెళ్ల వెంకటేశ్, ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన పర్లపల్లి శ్రీకాంత్, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన రాజశేఖర్ గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం సాయిగోన్ బావికి చెందిన బండమిద్ది స్వామి, అరుట్ల రాజు, రంగారెడ్డి జిల్లా మంచెల్ మండలం లోయపల్లి గ్రామానికి చెందిన బూడిద శివ, నల్గొండ జిల్లా దిండి మండలం గౌరారం గ్రామానికి చెందిన జోగు సైదులులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన చరణ్‌గౌడ్, ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘన్‌పూర్‌కు చెందిన యనమళ్ల రాకేష్, ఆత్మకూరు మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన ముత్యాల రామన్న, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం వావిలాళ్లపల్లికి చెందిన బచనగోని యాదగిరిలు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. నిందితుల నుంచి 65 నకిలీ వే బిల్లులు, టీఎస్ఎండీసీ 16 స్టాంప్‌లు, 16 లారీలు, 11 సెల్‌ఫోన్‌లు, 1 ల్యాప్‌లాప్, రూ.41వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆదాయానికి గండి

ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం చెల్లించకుండా నిందితుల కంప్యూటర్ ద్వారా ఈ ముఠా ఇప్పటికి సుమారు 1,700 వే బిల్లులు సృష్టించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని పేర్కొన్నారు. ఈ ముఠా సభ్యుల్లో లారీ ఓనర్ల పై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వానికి ఇసుక లోడింగ్ కోసం 12 టైర్ల లారీ ఓనర్లు రూ.10,238, 14 టైర్ల ఓనర్లు రూ.13,085 , 16 టైర్ల ఓనర్లు రూ.14,800 చెల్లించి డీడీలను టీఎస్ఎండీసీకి చెల్లించి ఇసుక లోడింగ్ చేసుకుంటారని, అలా కాకుండా కంప్యూటర్ పై అవగాహన ఉన్న ఏదుల కిరణ్‌కుమార్ నకిలీ వే బిల్లులను క్యూఆర్ కోడ్‌తో సహా సృష్టించి ప్రభుత్వానికి ఆదాయం రాకుండా చేసారని సీపీ తెలిపారు. కొంతమంది దళారులను ఏర్పాటు చేసుకొని లారీ ఓనర్లతో నేరుగా సంబంధాలను ఏర్పాటు చేసుకొని గత కొంతకాలంగా ఈ ముఠా రాష్ట్రంలోని 37 ఇసుక రీచ్‌లలో దందా కొనసాగిస్తున్నదని సీపీ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ వే బిల్లుల దందా కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. విచారణ ప్రాథమిక దశలో ఉందని వారం పదిరోజుల్లో ఈ ముఠాకు సంబంధించిన అన్ని వ్యవహారాలను వెలికి తీస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మట్టెవాడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులను సీపీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ బారీ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లులను సీపీ అభినందించారు.

నడుస్తున్న ఆటోపై విరిగిపడిన చెట్టు


ఆటోపై పడిన చెట్టు


ఆస్పత్రిలో చికిత్స చేస్తున్న వైద్యులు

- ఏడుగురికి గాయాలు
- ఆస్పత్రికి తరలింపు

ఏటూరునాగారం: కూలీలు, విద్యార్థులతో వెళ్తున్న ఆటోపై రోడ్డు పక్కనే ఉన్న చెట్టు విరిగిపడి ఏడుగురు గాయపడిన ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని కొండాయికి చెందిన ఆటో డ్రైవర్ బొల్లికొండ శ్రీకాంత్ తన ఆటోలో మల్యాలకు చెందిన పిచ్చి నర్సమ్మ, పాయం జగ్గమ్మ, పాయం సాయన్న, షాపెల్లికి చెందిన విద్యార్థి బీఏ ఫైనలియర్ వావిలాల దుర్గప్రసాద్, కొండాయికి చెందిన దబ్బగట్ల సారక్క, శివరంజితో కొండాయి నుంచి ఏటూరునాగారం వస్తున్నారు. చిన్నబోయినపల్లి - ఏటూరునాగారం మార్గమధ్యలోని వట్టివాగు వద్దకు రాగానే ఎండిపోయి ఉన్న భారీ వృక్షం రాత్రి వర్షం వల్ల నడుస్తున్న ఆటోపై విరిగి పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పిచ్చి నర్సమ్మకు ఎడమ చేయి, పాయం జగ్గమ్మ ఎడమ భుజానికి, వావిలాల దుర్గ ప్రసాద్‌కు ఎడమకాలుకు తీవ్ర గాయాలుకాగా డ్రైవర్ శ్రీకాంత్, శివరంజి, సాయన్న, సారక్కలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి 108లో తరలించి చికిత్సలు అందించారు. చెట్టు ఆటో పై పడడంతో 163 జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. ఆటోపై పడిన చెట్టును గ్రామస్తులు, ప్రయాణికుల సాయంతో తొలగించి క్షతగాత్రులను కాపాడారు. ఆటో నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ లబోదిబోమంటున్నారు.


గాయపడిన పిచ్చి నర్సక్క

ఆలయంలో నాలుగుసార్లు చోరీ

- సిద్దేశ్వరాలయంలో తరచూ దొంగతనాలు
- అయినా మారని తీరు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సంపత్‌రావు

చెన్నారావుపేట: అది మండల కేంద్రంలోని ఆలయం.. తరచూ చుట్టూ జనాలు సంచరిస్తూనే ఉంటారు.. అయినా.. ఆ ఆలయంలో తరచూ దొంగతనాలు జరుగుతుండడం గమనార్హం. ఇప్పటికే ఆలయంలో నాలుగుసార్లు దొంగతనం జరగడం చూస్తుంటే.. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్దేశ్వరాలయం పూజరులు సోమవారం రోజువారీ పూజలు చేయడానికి ఆలయం చేరుకున్నారు. గుడి వద్దకు రాగా తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి, విషయాన్ని ఆలయకమిటీ చైర్మన్ కంది గోపాల్‌రెడ్డితో పాటు పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి ఏసీపీ సంపత్‌రావు, సీఐ హతిరామ్, ఎస్సై తోట మహేందర్‌లు చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగులగొట్టి, హుండీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అయితే హుండీలో సుమారుగా రూ.50వేల వరకు ఉన్న నగదు ఉంటుందని అర్చకులు, పోలీసులు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. పోలీస్ స్టేషన్ సమీపంలోని పొలాల్లో హుండీలు పడేయడం గమనార్హం.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

- ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ శేషు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శేషు

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేషు మాట్లాడారు. వ్యక్తులు చేసిన తప్పులు వ్యవస్థకు అపాదించడం సరైంది కాదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు. వ్యక్తులు వ్యవస్థల భాగమేనని గుర్తించాలన్నారు. టీఎస్పీఎస్సీలో జరిగిన తప్పిదాల నుంచి ప్రభుత్వం తప్పించుకోవాలనుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లోను అప్రతిష్ట మూటగట్టుకున్న ఏపీపీఎస్సీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో ఏర్పాటైన టీఎస్పీఎస్సీ కూడా అదే దారితో నడుస్తుందని ధూర్జారబట్టారు. ప్రశ్నాపత్రాల లీక్, ప్రశ్నాపత్రాల్లో తప్పులు, భర్తీ ప్రక్రియలో జాప్యం వంటి అనేక తప్పిదాలతో టీఎస్పీఎస్సీ నిరుద్యోగుల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. ఈ క్రమంలో టీఎస్పీఎస్సీని సమూలంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్, మెయిల్ ద్వారా ప్రక్షాళనకు చెందిన సూచనలను ఇప్పటికే పంపామని, లేఖ ద్వారా పంపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా వేదిక నాయకులు సతీష్, చిన్నాల యశ్వంత్ యాదవ్, అజయ్, నరేందర్, దానేశ్వర్, జితేందర్, కిరణ్, బోస్ పాల్గొన్నారు.

తెలంగాణకు రెండో బహుమతి


బహుమతితో జీవిత

వరంగల్(పర్వతగిరి): జైపూర్‌లో గత మూడు రోజులుగా నిర్వహించిన స్క్వాష్ రాకెట్ పోటీలకు గాను తెలంగాణకు రెండో బహుమతి లభించింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన జీవిత పోటీల్లో నైపుణ్యం సాధించి రెండో బహుమతికి దోహదపడింది. దేశవ్యాప్తంగా పది టీంలు పాల్గొనగా మొదటి బహుమతి మహారాష్ట్ర దక్కించుకోగా, రెండో బహుమతి తెలంగాణ కైవసం చేసుకుంది. గతంలో అథ్లెటిక్ పోటీల్లో జాతీయ స్థాయిలో.. ప్రస్తుతం స్క్వాష్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించడం గర్వంగా ఉందని ఆమె తెలిపారు.

మావోయిస్టు సానుభూతిపరుల అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న ఎస్పీ గాష్ ఆలం

ములుగు: మావోయిస్టులకు సహకరిస్తేశాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు ఎస్పీ గాష్ ఆలం హెచ్చరించారు. ఈ మేరకు అనుమానితంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఎనిమిది మంది నిషేధిత సీపీఐ మావోయిస్టు సానుభూతిపరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని పోలీసు సాయుధ కార్యాలయంలో ఎస్పీ గాష్ ఆలం విలేకరుల సమావేశంలో అరెస్ట్ చూపించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో వెంకటాపురం(కె) మండలం రామచంద్రాపురం శివారులో కొంతమంది కారు, ద్విచక్రవాహనంపై అనుమానస్పదంగా ప్రయాణిస్తున్నారని తెలుసుకున్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వారిని వెంబడించారు. కారు, ద్విచక్రవాహనాన్ని వెంబడించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలోని పేలుడు పదార్థాలు, ఐఈడీ మెటీరియల్‌లోని తోహభాగాలు, విప్లవ, సాహిత్య పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మావోయిస్టు అగ్రనేత దామోధర్, చంద్రన్నతో కలిసి , మరికొంత మంది సభ్యులు భూ సమస్యలను పరిష్కరించడానికి చేస్తున్న విప్లవ భావజాలానికి ఆకర్షితులయ్యారు. దామోదర్ సూచనల మేరకు కూంబింగ్ ఆపరేషన్ల కోసం అడవికి వచ్చే పోలీసులను చంపాలనే ఉద్దేశంతో పేలుడు పదార్థాలను తరలిస్తూ కనిపించారు. పట్టుబడిన వారిని విచారించగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారం గ్రామానికి చెందిన అంది రవి, వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడ గ్రామానికి చెందిన శ్రీరామోజు మనోజ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన దిడ్డి సత్యం, సంగెం మండలానికి చెందిన శ్రీరామోజు భిక్షపతి, మల్హార్ మండలం పెద్దతండా గ్రామానికి చెందిన అనసూరి రాంబాబు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా మండలానికి చెందిన గణపురం చంద్రమౌళి, కాప్రా మండలానికి చెందిన పృథ్వీరాజ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారానికి చెందిన అంది మానసగా తెలిసింది. నిందితులు అందరిపై కేసులు ఉన్నట్లుగా ఎస్పీ తెలిపారు. వారి నుంచి ఐఈడీఎస్–45 యొక్క ఇనుప భాగాలు, 10 మీటర్ల కార్డెక్స్ వైర్, రెండు డిటోనేటర్లు, ఒక బ్యాటరీ, నాలుగు విప్లవ సాహిత్యాలు, మధుమేహం, ఇతర అనారోగ్య సమస్యలకు సంభందించిన మాత్రలు, కారు బేరింగ్, హోండా మోటార్ ద్విచక్రవాహన బేరింగ్, ఎనిమిది మొబైల్ ఫోన్లు, రూ. 4140 నగదు పట్టుబడినట్లు తెలిపారు. సంఘటన ఆధారంగా వెంకటాపురం(కె) పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశామని అన్నారు. సమావేశంలో ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, వెంకటాపురం(కె) సీఐ శివప్రసాద్, ఎస్సై తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆబ్కారీ చేతివాటం

- పట్టుకున్న నల్లబెల్లం అమ్మకానికి తరలింపు
- గుట్టు రట్టు చేసిన మరిపెడ పోలీసులు
- సోషల్ మీడియాలో వైరల్


పట్టుబడిన తొర్రూరు ఎక్సైజ్ బెల్లం వాహనం

మరిపెడ రూరల్: అక్రమ వ్యాపారాలు ఆట కట్టించే ఆబ్కారీ పోలీసులు చేతివాటం ప్రదర్శించారు. ఓ వేలం వేసిన వాహనంలో అక్రమంగా నల్ల బెల్లం తరలించి అమ్మడానికి డంపు చేస్తుండగా మరిపెడ పోలీసులు పట్టుకుని గుట్టురట్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఎక్సైజ్ పరిధిలో అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న పలు వాహనాలను అబ్కారి ఆధ్వర్యంలో ఇటీవల వేలం వేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు వేలం పాటలో వాహనాలు దక్కించుకున్నారు. ఈ ఇదే అదునుగా భావించిన ఎక్సైజ్ అధికారులు చేతి వాటం ప్రదర్శించారు. అనుకూలంగా ఉన్న ఓ బెల్లం బస్తాల లోడ్ వాహనాన్ని అర్ధరాత్రి అక్రమంగా తరలించారు. మరిపెడ మండలంలోని యలమంచిలితండాలో శివారులో డంప్ చేస్తున్నారు. తండా వాసుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న మరిపెడ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సదరు వాహనాన్ని పట్టుకొని మరిపెడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో డ్రైవర్ విచారించడంతో అసలు విషయం బయటకు పొక్కింది. వెంటనే మేల్కొన్న ఆబ్కారీ అధికారి తమ ఆధీనం నుంచే బెల్లం లోడ్ వాహనం అటు వైపుగా వచ్చిందని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చి వాహనాన్ని తొర్రూరు తీసుకెళ్లారు. కంచె చేను మేసిన చందంగా తొర్రూరు ఎక్సైజ్ పోలీసుల తీరు ఉందని ప్రజలు అవాక్కవుతున్నారు. ఈ వ్యవహారమంతా పామాజిక మాద్యమాల్లో వైరల్ కావడం గమనార్హం. ఈ విషయం పై తొర్రూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా. వేలం వేసిన వాహనం విజయవాడకు వెలుతుంది. తమ తప్పిదం వల్ల బెల్లం బస్తాలు అందులోనే ఉండిపోవడంతో మరిపెడ పోలీసులు పట్టుకొని సమాచారం ఇచ్చినట్లు సదరు అధికారి పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మాయ

కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన ఓ యువతి ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తుల మాటలు నమ్మి రూ.30వేలు నష్టపోయింది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటకు చెందిన యువతి ఓఎల్ఎక్స్ అప్లికేషన్స్ పరిశీలిస్తుండగా అందులో ఒక పల్సర్ బైక్ అమ్మకానికి ఉండగా కింద ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి బేరం కుదుర్చుకుంది. జీఎస్టీ, ట్రాన్స్‌ఫోర్ట్ ఛార్జీల కింద మోసగాళ్లు చెప్పినట్లుగా డబ్బులను చెల్లించింది. ఆ తర్వాత అటువైపు నుంచి సమాధానం లేకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు


గంజాయిని పరిశీలిస్తున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం : ఎండు గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు, సరఫరాకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను మిల్స్‌కాలనీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ తెలిపారు. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్రాల నుంచి భద్రాచలం మీదుగా వరంగల్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మంపాటి సుమంత్, పాకాల సాయికుమార్, ములుగు వికాస్ అలియాస్ విక్కీలను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.60 వేల విలువగల మూడు కిలోల ఎండు గంజాయి, 2 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు శివనగర్‌కు చెందిన కమ్మంపాటి సుమంత్ కరీంనగర్‌లో కొబ్బరి బోండాల వ్యాపారం చేసుకుంటూ ఎవరికి అనుమానం రాకుండా గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడేవాడని తెలిపారు. సుమంత్ స్నేహితులైన పాకాల సాయికుమార్, ములుగు వికాస్‌లు ఎవరికి అనుమానం రాకుండా వరంగల్, మహబూబాబాద్ మీదుగా భద్రాచలం నుంచి ఒడిషాలోని కలిమెలకు ద్విచక్ర వాహనం పై చేరుకొని అక్కడ మొద్దు అలియాస్ భాయ్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి తిరిగి వరంగల్‌కు చేరుకొని 100 గ్రాముల గంజాయిని రూ.500, రూ.700, రూ.1000 చొప్పున అమ్మే వారని తెలిపారు. వరంగల్‌లోని శివనగర్, కాశిబుగ్గ, కరీమాబాద్, ఖిలా వరంగల్, చింతల్, లేబర్‌కాలనీ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. కొంతమంది పాఠశాల, కళాశాల విద్యార్థులకు గంజాయిని అలవాటు చేసి వారి ద్వారా గంజాయి విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. 15 మంది గంజాయి విక్రయదారులు, 50 మంది వినియోగదారులను ఆదివారం రాత్రి ఖిలా వరంగల్‌లోని రాతికొండ దగ్గరకు వస్తున్నారనే సమాచారంతో వెళ్లగా ముగ్గురు నిందితులు పట్టుబడినట్లు తెలిపారు. ఇప్పటి వరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు 13 మంది గంజాయి అమ్మకందారులను అదుపులోకి విచారిస్తున్నట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు గంజాయి సేవించే వారిని 159 మందిని గుర్తించి కమిషనరేట్‌లోని ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 14 మందిని జైలుకు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు, ఎస్సైలు వడ్డెబోయిన లవణ్‌కుమార్, నిస్సార్ పాషా, కానిస్టేబుళ్లు రాజేష్, రాజు, బిక్షపతి, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, నవీన్‌లను సీపీ నగదు రివార్డులతో అభినందించారు.

నల్లబెల్లం స్వాధీనం.. కేసు నమోదు


మరిపెడలో పట్టుబడిన బెల్లం లోడ్ నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మరిపెడ రూరల్: అక్రమంగా రవాణ చేస్తున్న 21 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకున్నట్లు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై మధు సోమవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం స్టేజి నుంచి వయా విస్సంపల్లి, ఎల్లంపేట మీదుగా సోమ్లతండాకు ఓ వాహనంలో బెల్లం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 42 బస్తాల్లోని 21 క్వింటాళ్ల నల్ల బెల్లాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి సోమ్లతండాకు చెందిన గుగులోతు నవీన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాకు చెందిన పుల్లారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో సత్యప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రావణ్, మధార్ పాల్గొన్నారు.